# చిరుత స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

విశాఖపట్టణం, మార్చి 14 చిరుతను వేటాడి చంపి.. దాన్ని చర్మాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు విశాఖ పోలీసులు. నిఘా పెట్టి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి చిరుత చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ ముఠాను ఎలా పట్టుకున్నారంటే... చిరుతపులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు డీఆర్ఐ (ఆఖీఎ) అధికారులు విశ్వసనీయవర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో విశాఖలో నిఘా పెట్టారు. ఆర్కే బీచ్ దగ్గర పాండురంగపురం సమీపంలోని ఓ హోటల్ దగ్గర ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటం గుర్తించారు. ఆ ముగ్గురినీ తనిఖీ చేశారు. వారి వద్ద చిరుతపలి చర్మం ఉండటంతో... వారిని అదుపులోకి తీసుకున్నారు. చిరుతపులులను వేటాడి దాన్ని చర్మాన్ని విక్రయించి పెద్దమొత్తంలో సొమ్ము చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టడంతో పక్కా ప్లాన్ ప్రకారం తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా... విశాఖ మీదుగా చిరుత చర్మాన్ని తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. అంతేకాదు... పట్టుబడిన ముగ్గురుతో పాటు మరో వ్యక్తి పాత్ర కూడా ఉందని పోలీసులు తెలుసుకున్నారు. నిందితులు ఇచ్చిన సమాచారంతో.. ముఠాలోని కీలక వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**

కర్నూలు సంపుటి : 03 సంచిక : 339 శుక్రవారం 15-03-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# పేదల భవిష్యత్‌పై చంద్రబాబు యుద్ధం



- కూటమి పేరుతో వస్తున్న వారి నిజస్వరూపం గుర్తించండి
- ప్రజాసంక్షేమం కొనసాగాలంటే వైకాపా గెలవాలి
- 14 ఏళ్లు సిఎంగా చంద్రబాబు చేసిందేమిటో చూడండి
- పవన్ కళ్యాణ్ ఓ మ్యారేజ్ స్టార్ మాత్రమే
- బనగానపల్లిలో ఇబిసి నేస్తం నిధులు విడుదల
- చంద్రబాబు, పవన్‌లపై జగన్ ఘాటు విమర్శలు









నంద్యాల,మార్చి14 : పేదల భవిష్యత్తుపై యుద్ధానికి చంద్రబాబు కూటమి మరోసారి సిద్ధమైందని.. ఈ ఎన్నికల్లో ఓటు అనే దివ్యాస్త్రాన్ని వాళ్ల మీద జాగ్రత్తగా ప్రయోగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పిలుపు ఇచ్చారు. పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని కొనసాగిం చాలంటే వైకాపా మళ్లీ గెలవాల్సి ఉందన్నారు. బనగానపల్లెలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల సందర్భంగా చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియాపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవంక.. మనకు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబును, దత్తపుత్రుడిని చూడండి. వీరిద్దరి పేరు చెబితే అక్కచెల్లెమ్మలకు ఏం గుర్తుకొస్తుంది?. చంద్రబాబు పేరు చెబితే 14 సంవత్సరాలు, 3 సార్లు సీఎం అయిన వ్యక్తి పేరు చెబితే గుర్తొచ్చేది బాబు చేసిన వంచనలు గుర్తుకొస్తాయి. పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు చేసిన దగా గుర్తుకొస్తుంది.? ఆయన చేసిన ఒక్కటంటే ఒక్క మంచీ గుర్తుకురాదు. ఒక్క స్కీము కూడా గుర్తుకురాని పరిస్థితి. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థను భ్రష్టు పట్టించే ఓ మోసగాడు గుర్తుకొస్తాడు. ఏదేండ్లకోకసారి కార్లు మార్చినట్లుగా భార్యలను మార్చే ఒక మ్యారేజీ స్టార్, ఓ వంచకుడు గుర్తుకొస్తాడు. ఒకరికి విశ్వసనీయత లేదు. మరొకరికి విలువలు లేవు. వీరు మూడు పార్టీలుగా కూటమిగా ఏర్పడి ఈరోజు మీ బిడ్డ మీదకు యుద్ధానికి వస్తున్నారు.. కాదు కాదు.. మూడు పార్టీలుగా కూటమిగా ఏర్పడి పేదవాడి భవిష్యత్ మీద యుద్ధానికి వస్తున్నారని హెచ్చరించారు. దేవుడి దయతో ఈరోజు మరో మంచి కార్యక్రమం ఇక్కడ బనగానపల్లె నుంచి చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబాలకు కూడా మంచి చేస్తూ ఈరోజు మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఈబీసీ నేస్తం అనే ఈ పథకంతో 45నుంచి 60 సంవత్సరాల వయసులో ఉన్న నా అక్కచెల్లెమ్మలందరికీ రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, వెలమ, బ్రాహ్మణ.. తదితర ఓసీల్లో ఉన్న అక్కచె÷-లలెమ్మలకు కూడా ఆర్థిక స్వావలంబన కలిగిస్తూ ఏటా రూ.15,000 చొప్పున వరుసగా చేయి పట్టుకుని నడిపిస్తూ మూడేళ్లపాటు సహాయం అందించే కార్యక్రమంమే ఈ వైఎస్సార్ ఈబీసీ నేస్తం అన్నారు. పేదరికానికి కులం ఉండదు. పేదవాడు ఎక్కడ ఉన్నా కూడా వారికి తోడుగా ఉండగలిగే మనసు ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు ఉండాలి. ఆదుకునే గుణం ఉండాలి, తోడుగా నిలబడాలి అనే ఆరాటం ఉండాలి. వైఎస్సార్ ఈబీసీ నేస్తంగానీ, వైఎస్సార్ కాపు నేస్తంగానీ మేనిఫెస్టోలో పెట్టినవి కావు. అయినా వారికి త తోడుగా ఉండాలని, పేదరికం వల్ల వారు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని వారి కోసం కూడా అడుగులు వేసిన ప్రభుత్వం మీ బిడ్డ ప్రభుత్వం. ఈరోజు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 4,19,528 మంది నా అక్కచె÷-లలెమ్మలకు 629 కోట్లు వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేయనున్నాం. ఈరోజు జమ చేస్తున్న ఈ సొమ్ముతో కలుపుకొంటే మూడు దఫాల్లో 4,95,269 మంది అక్కచె÷-లలెమ్మలకు మంచి జరిగిస్తూ రూ.1877 కోట్లు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా మంచి చేయగలిగాం అని అన్నారు. ఈబీసీ నేస్తం పథకంలో కొత్తగా ఆర్థిక సాయం అందుకుంటున్న అక్కచెల్లెమ్మలు 65618 మంది అయితే, 107824 మంది నా అక్కచెల్లెమ్మలు ఇదే ఈబీసీ నేస్తం రెండు సార్లు పొందారు. 3,21,827 మంది మొత్తంగా మూడు సార్లు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా లబ్ది అందుకున్నారు. వరుసగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా తోడుగా నిలుస్తూ చేయిపట్టుకుని నడిపించగలిగితే, ఈ డబ్బులతో వ్యాపారం చేసుకునే పరిస్థితి ఉంటుంది. తమ కాళ్లపై తాము నిలబడే పరిస్థితి ఉంటుంది. వారి కుటుంబాలన్నీ బాగు పడే పరిస్థితి వస్తుంది.? ఈ వ్యాపారంతో నెలనెలా కనీసం 610 వేలు అదనంగా ఆదాయం వచ్చే పరిస్థితి వస్తుంది. వైఎస్సార్ చేయూత ద్వారా 4560 సంవత్సరాల వయసున్న నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అక్కచె÷-లలెమ్మలకు మంచి జరిగిస్తూ వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 4560 సంవత్సరాల వయసున్న కాపు అక్కచె÷-లలెమ్మలకు అండగా నిలబడటం, ఆర్థిక సాధికారతకు సహకారం అందిస్తున్నట్లుగానే వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా ఓసీ కుటుంబాల అక్కచె÷-లలెమ్మలకు అండగా ఉంటున్నాం. మంచి జరిగిస్తూ ఒక చేయూత ద్వారానే నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అక్కచె÷-లలెమ్మలకు దాదాపుగా 33,14,000 మందికి మంచి జరిగిస్తూ అడుగులు పడ్డాయి. వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 4,64,000 మందికి మంచి జరిగిస్తూ అడుగులు పడ్డాయి. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 4,95,000 మందికి మంచి జరిగించాం. మొత్తంగా 4560 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న అక్కచె÷-లలెమ్మలు 44,74,000 మందికి మంచి జరిగిస్తూ ఈ 58 నెలల కాలంలో అడుగులు పడ్డాయి. అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు ఇచ్చే పెన్షన్ గానీ, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇళ్ల పట్టాలపంపిణీ, అక్కచె÷-లలెమ్మల పేరిటే రిజిస్ట్రేషన్, ఇళ్లు కట్టించే కార్యక్రమం, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇవన్నీ కూడా నా అక్కచెలలెమ్మలు బాగుండాలి, కుటుంబాలు బాగుం డాలని ఎక్కడా కూడా కులం చూడటం లేదు, వర్గం, మతం, ప్రాంతం, చివరకు ఏ పార్టీకి ఓటు వేశారనేది కూడా చూడటం లేదు?

# 'ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రద్దుపై సుప్రీంకు వెళ్తాం'.. ఛైర్మన్ గౌతమ్ సవాంగ్



అమరావతి, మార్చి 14: ఆంధ్రప్రదేశ్‌లో 2018లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ రద్దు చేయాని హైకోర్టు బుధవారం (మార్చి 13) ఏపీపీఎస్సీని ఆదేశించిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పుపై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడతామని, ఉద్యోగుల తరఫున న్యాయపోరాటానికి దిగుతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తామని ప్రకటించింది. కాగా ఏపీలో 2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై మార్చి 13న రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2018 గ్రూప్-1 మెయిన్స్ జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఆ ప్రక్రియను రద్దుచేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జవాబు పత్రాలను రెండు సార్లు మాన్యువల్ (చేతితో దిద్దడం) విధానంలో మూల్యాంకనం చేశారంటూ ఆరోపించారు.దీనిని విచారించిన కోర్టు గతంలో జరిగిన మెయిన్స్ పరీక్షను రద్దు చేసింది. పరీక్షకు ముందు అభ్యర్థులకు కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని, ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తిచేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఈ పోస్టులకు ఎంపికై ఉద్యోగాలు చేస్తు?న్న వారు కోర్టు ఆదేశాల మేరకు కట్టుబడి ఉంటామని తెల్పుతూ అఫిడవిట్ ఇచ్చినట్లు కోర్టు గుర్తు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం కీలక తీర్పు ఇచ్చారు.కాగా 162 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి 2018లో డిసెంబర్ 31న నోటిఫికేషన్ వెలువరించింది. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన వారందరికీ ప్రిలిమ్స్ నిర్వమించారు. వీటి జవాబు పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేసి, 326 మందిని ఏపీపీఎస్సీ అర్హులుగా తేల్చింది. ఆ తర్వాత మొదటిసారి మాన్యువల్ మూల్యాంకనంలో వారిలో 202 మందిని అంటే దాదాపు 62 శాతం మందిని అనర్హులుగా నిర్ణయించింది. జవాబుపత్రం ఒకటే అయినప్పుడు ఎలా మూల్యాంకనం చేసినా అంతమంది ఎలా అనర్హులవుతారని అభ్యర్థులు ప్రశ్నించారు. వీటిని రెండోసారి కూడా మాన్యువల్ మూల్యంకనం చేసినట్లు పిటషనర్లు ఆధారాలతో సహా రుజువు చేశారు. మొదటిసారి దిద్దిన ఫలితాలను పక్కదారిమళ్లించి, రెండోసారి దిద్దించి నచ్చిన వారిని ఎంపిక చేసుకొని ఏపీపీఎస్సీ ఫలితాలు ప్రకటించిందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం మెయిన్స్ జవాబు పత్రాలను పలుమార్లు మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసి 6 నెలల్లోపు మళ్లీ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది. హైకోర్టు తాజా తీర్పుతో ప్రస్తుతం గ్రూప్ 1 అధికారులుగా ఉన్న 143 మంది ఉద్యోగాలు కోల్పోయినట్లైంది.

# ఎమ్మెల్యేగా పోటీకే పవన్ మొగ్గు

**పిఠాపురం నుంచి పోటీ చేయనున్న జనసేనాని**

**ఆవిర్భావ దినోత్సవంలో స్వయంగా ప్రకటన**

మంగళగిరి,మార్చి14: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఉత్కంఠ వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్టు పవన్ స్వయంగా వెల్లడించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ సభలో ఈమేరకు ప్రకటన చేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉందని, ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. తెదేపా, భాజపాతో పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన బుధవారం రాత్రి మరో 9 మందికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. వారితో మాట్లాడి ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెందుర్తి నియోజకవర్గం నుంచి పంచకర్ల రమేశ్, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్, విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణయాదవ్‌లను పిలిచి మాట్లాడి ప్రచారం చేసుకోవాలని చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, భీమవరం నుంచి మంగళవారం పార్టీలో చేరిన పులపర్తి రామాంజనేయులు అభ్యర్థిత్వాలకు ఆమోదం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి దేవవరప్రసాద్ అభ్యర్థిత్వం ఖరారు చేశారు.



# టీడీపీ జాబితా విడుదల

విజయవాడ, మార్చి 14,టీడీపీ రెండో జాబితా విడుదలైంది. మొత్తం 34 మందితో టీడీపీ ఈ జాబితాను చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు కొన్ని రోజుల క్రితం టీడీపీ తొలిజాబితాలో 94 అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల పేర్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో టీడీపీ మొత్తం 128 అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లయింది.రాజమండ్రి రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్య చౌదరి పోటీ చేయనున్నారు. ఆత్మకూరు నుంచి ఆనం రాంనారాయణ రెడ్డి, దెందలూరు నుంచి చింతమనేని ప్రభాకర్ పోటీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టీడీపీ పోటీ చేయాల్సిన స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తోంది.టీడీపీ రెండో జాబితాలో 27 మంది పురుషులు, ఏడుగురు మహిళలకు చోటు దక్కింది. రెండో జాబితాలో పీహెచ్‌డీ చేసిన వారు ఒక్కరు, పీజీ చేసిన వారు 11మంది, గ్రాడ్యుయేట్లు తొమ్మిది మంది, ఇంటర్మీడియట్ చదివిన వారు ఎనిమిది మంది, 10వ తరగతి చదివిన వాళ్లు ఐదుగురు ఉన్నారు.రెండు జాబితాలోనూ సీనియర్లు కళా వెంకట్రావు, దేవినేని ఉమా, సోమిరెడ్డి చంద్రమోహన్ పేర్లు లేవు. గురజాల టికెట్ యరపతినేని శ్రీనివాసరావు దక్కించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టీడీపీలో సస్పెన్స్ కొనసాగుతోంది.

నరసన్నపేట - బగ్గు రమణమూర్తి,గాజువాక - పల్లా శ్రీనివాసరావు,చోడవరం- కె.ఎస్.ఎన్.ఎస్. రాజు,మాడుగుల - పైలా ప్రసాద్,ప్రత్తిపాడు- వరుపుల సత్యప్రభ

రామచంద్రపురం - వాసంశెట్టి సుభాష్,రాజమండ్రి రూరల్ -గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రంపచోడవరం - మిర్యాల శిరిష,కొవ్వూరు -ముప్పిడి వెంకటేశ్వరరావు,దెందులూరు- చింతమనేని ప్రభాకర్,గోపాలపురం- మద్దిపాటి వెంకటరాజు,పెదకూరపాడు - భాష్యం ప్రవీణ్,గుంటూరు పశ్చిమ - పిడురాళ్ల మాధవీ,గుంటూరు తూర్పు - మహ్మద్ నజీర్

గురజాల - యరపతినేని శ్రీనివాసరావు,కందకూరు - ఇంటూరి నాగేశ్వరరావు

మార్కాపురం - కందుల నారాయణరెడ్డి,గిద్దలూరు-ముత్తుముళ్ల అశోక్ రెడ్డి

ఆత్మకూరు- ఆనం రామనారాయణరెడ్డి,కోవూరు - వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

వెంకటగిరి = కురుగొండ్ల లక్ష్మిప్రియ,కమలాపురం- పుత్తా చైతన్యరెడ్డి

ప్రొద్దుటూరు -వరదరాజులురెడ్డి,నందికొట్కూరు - గిత్తా జయసూర్య,కదిరి - కందికుంట యశోదా దేవి,పుట్టపర్తి - పల్లె సింధూరా రెడ్డి,మంత్రాలయం - రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మిగనూరు - జయనాగేశ్వర రెడ్డి,పూతలపట్టు - డాక్టర్ కలికిరి మురళీమోహన్

సత్యవేడు - కోనేటి ఆదిమూలం,శ్రీకాళహస్తి - బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి,చంద్రగిరి - పులివర్తి వెంకట మణి ప్రసాద్,పుంగనూరు - చల్లా రామచంద్రారెడ్డి,మదనపల్లి - షాజహాన్ బాషా



# సంపాదకీయం

శుక్రవారం 15-03-2024

## బెంగళూరులో నీటి సంక్షోభం

బోర్లు అడుగంటాయి. చెరువులు ఎండిపోయాయి. నదులు పిల్ల కాలువలను తలపిస్తున్నాయి. ఇప్పట్లో వర్షాలు కురిసే అవకాశం లేదు. ఉన్న భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతున్నాయి. ఇలాంటి సమయంలో అక్కడి ప్రభుత్వానికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. తెరపైకి అనేక నిబంధనలు తీసుకొచ్చింది. వాటర్ సర్వీసింగ్ సెంటర్లను మూసివేసింది. నీళ్లను అడ్డగోలుగా వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. తాగే నీటికి కటకట.. స్నానం వారానికి ఒక్కసారే.. ఇది ప్రస్తుతం దేశ ఐటీ రాజధాని బెంగళూరులో నెలకొన్న పరిస్థితి.మార్చి నెలలోనే బెంగళూరు వాసులు నీళ్ల కోసం ఆర్తనాదాలు పెడుతున్నారంటే.. ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బోర్లు ఎండిపోవడంతో బెంగళూరులో నీటి సంక్షోభం తీవ్ర రూపు దాల్చింది. స్థానికులు అవసరాల కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే సమయంలో ట్యాంకర్ నిర్వాహకులు అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు. గతంలో ఒక ట్యాంకర్ 600 నుంచి 1000 వరకు లభ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఆ ధర ఏకంగా రెండు వేలకు పెరిగిందంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధరలు తగ్గించాలని హెచ్చరించడంతో ట్యాంకర్ నిర్వాహకులు నగరానికి రావడమే మానేశారు. దీంతో ప్రజలు అవసరాల కోసం ఆర్.ఓ ప్లాంట్ల మీద ఆధారపడుతున్నారు. అక్కడ కూడా ఒక్కొక్కరికి ఒక్కో క్యాన్ మాత్రమే ఇస్తున్నారు. ప్లాంట్ల వద్ద భారీగా క్యూ ఉండటంతో, నీటి కోసమే గంటలపాటు నిలబడాల్సి వస్తోందని బెంగళూరు నగరవాసులు అంటున్నారు. స్నానం చేయడానికి, వంట చేసుకోవడానికి తగినంత నీరు కూడా లభించడం లేదని వారు వాపోతున్నారు. వంట చేసుకోవడానికి కార్పొరేషన్ నీటిని కాచి, వడపోసి వినియోగిస్తున్నామని చెబుతున్నారు.. గత మూడు నెలలుగా తాము ఈ ఇబ్బంది పడుతున్నామని.. బెంగళూరు నీటి సరఫరా, సీవరేజ్ బోర్డు (బీఎం డబ్ల్యూ ఎస్ఎస్ బీ) అధికారులకు ఫోన్ చేసిన పట్టించుకోవడంలేదని అంటున్నారు.. నీటి కరువు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నన్ను వైట్ ఫీల్డ్ లోని ఓ హౌసింగ్ సొసైటీ కఠిన నిర్ణయం తీసుకుంది.. నీటి వినియోగాన్ని 20% తగ్గించకుంటే 5000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది.తాగునీటి కరువు నేపథ్యంలో.. ప్రైవేటు వాటర్ ట్యాంకర్లను స్వాధీనం చేసుకుంటామని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ హెచ్చరించారు.. సమస్య పరిష్కారానికి అన్ని వాటర్ ట్యాంకులు తమ వివరాలను బెంగళూరు నగరపాలక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. లలో ఐదు రోజులు మాత్రమే స్నానం.. వంట చేయడానికి కూడా నీరులేక ఆన్‌లైన్ ఆర్డర్ చేసుకుని కడుపు నింపుకుంటున్నారు. ఇక త్రాగేతర పనుల కోసం శుద్ధి చేసిన నీటిని ఎంతో పొదుపుగా వాడుకుంటున్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరు నగర ప్రజల నీటి కష్టాలు ఇవి. అక్కడి నీటి సంక్షోభం తారా స్థాయికి చేరింది. గుక్కెడు తాగు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లు ఎండిపోవడంతో నగరంలో ఈ పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు తాగడానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడిందంటే.. అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. మరోవైపు నగర జలమండలి కూడా సరిపడా నీటిని సరఫరా చేయకపోవడంతో.. ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. డిమాండ్ పెరగడంలో ట్యాంకర్ల ధరలు అమాంతం పెంచేశారు.కొన్ని ప్రాంతాల్లో గత రెండు నెలలుగా ప్రజలు నీళ్ల కోసం నీటి ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు ఎండాకాలం ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. మునుముందు రోజుల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో నగరంలో రోజుకు 2,600 నుంచి 2,800 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉంటే కేవలం 1,300 ఎంఎల్‌డీ నీరు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. దీంతో నీళ్ల ట్యాంకర్లు వచ్చినా సరిపోవడం లేదంటూ వాపోతున్నారు. నీటి కష్టాలు ఎప్పటికి తీరతాయో.. తమకు సాధారణ రోజులు ఎప్పటికి వస్తాయోనని తలలుపట్టుకుంటున్నారు.మళ్లీ వర్షాలు పడితే తప్ప పరిస్థితి మామూలు స్థితికి వచ్చేలా కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ క్రమంలో పాలకుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు రోడ్లు, అపార్ట్‌మెంట్లపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. భూగర్భ జలాలలపై ఎన్నడైనా కృషి చేశారా? ఇలాంటి చర్యలు ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారువారందరితో సమావేశమయ్యారు? మరోవైపు నీటి కొరతను నివారించేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసింది. కాగా, రాష్ట్రంలోని 236 తాలూకాల్లో 219 తాలూకాలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నాయని ప్రభుత్వం ఇటీవల నివేదికలో పేర్కొంది.

# ప్రాణాలు తీస్తున్న పొలిటికల్ ట్రోల్స్

గుంటూరు, మార్చి 14, ఇంటి పట్టా అందుకున్న సంతోషంలో ఓ యువతి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురి కావడంతో ఆమె రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం ఏపీలో చర్చగా మారింది.అధికార, విపక్షాల మధ్య సోషల్ మీడియా వార్‌కు అమాయకురాలు బలైపోయింది. సొంతింటి కల నెరవేరిన సంతోషంలో మీడియా ముందు మాట్లాడిన మాటల్ని విపరీతార్థాలతో ట్రోల్ చేయడంతో మనస్తాపానికి గురైందని మృతురాలి కుటుంబ సభ్యులు చెబుతున్నారు.మార్చి 4వ తేదీన తెనాలిలో జరిగిన కార్యక్రమంలో గీతాంజలి అనే యువతి ఇంటి పట్టాను అందుకుంది. ఈ సందర్భంగా తనకు జరిగిన మేలు గురించి ఇంటర్వ్యూ ఇస్తూ ఉద్వేగానికి గురైంది. తమ కుటుంబంలో జరిగిన మేలును మీడియా ముందు చెప్పింది. ఆ తర్వాత రెండ్రోజులకు ఆమె వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం అయ్యాయి.గీతాంజలి అనుకూలంగా కొందరు ప్రచారం చేస్తే, ఆమెను ట్రోల్ చేస్తూ కించపరుస్తూ మరికొన్ని ముసుగు ముఖాలు చెలరేగిపోయాయి. ప్రభుత్వం ద్వారా పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను రకరకాల రూపాల్లో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ప్రచారం చేయడం, దానికి కౌంటర్ ఇచ్చే క్రమంలో ప్రత్యర్థులు పెడర్థాలతో ట్రోల్ చేయడం ఏపీలో సాధారణం అయిపోయింది.తెనాలి యువతి గీతాంజలి ఆత్మహత్య ఘటనపట్ల ముఖ్యమంత్రి వైయస్.జగన్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తననుగ్భ్రాంతికి గురిచేసిందని సీఎం అన్నారు. గీతాంజలి కుటుంబాన్ని ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గీతాంజలి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ కూడా చట్టం వదిలిపెట్టదని ముఖ్యమంత్రి అన్నారు.ఏపీలో రాజకీయాలకు మహిళలే మొదటి టార్గెట్ అవుతున్నారు. దాదాపు దశాబ్ద కాలంగా ఈ తరహా విపరీత ధోరణి కేవలం ఏపీ రాజకీయాల్లో మాత్రమే కనిపిస్తోంది. ప్రత్యర్థుల్ని మానసికంగా కుంగదీయడానికి, వ్యక్తిత్వ హననాలకు సోషల్ మీడియా వేదికగా మారుతోంది. ఈ క్రమంలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఏ రాజకీయ పార్టీ చొరవ చూపడం లేదు. సొంత కుటుంబ సభ్యులు ఈ తరహా ట్రోలింగ్‌లకు గురవుతున్నా ముఖ్యమైన వ్యక్తులు సైతం వాటిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.పార్టీని వీడి వేరు కుంపటి పెట్టుకున్న తర్వాత జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆయన తరపున జగనన్న వదిలన బాణాన్ని అంటూ జగన్ సోదరి షర్మిల పాదయాత్ర చేపట్టారు. ఏపీలో వందల కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు.సరిగ్గా ఆ సమయంలోనే సోషల్ మీడియాలో ఆమెపై విపరీతమైన దాడి జరిగింది. జగన్‌మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే క్రమంలో ప్రత్యర్థులకు షర్మిల తేలికపాటి టార్గెట్ అయ్యారు. ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ విపరీతమైన దుష్ప్రచారం జరిగింది. దీనిని ఖండిస్తూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకోవాల్సి వచ్చింది.ఆ తర్వాత కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇవి సాధారణం అయిపోయాయి. ఏపీ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న నేతల కుటుంబాల్లో మహిళలంతా ఏదొక సమయంలో సోషల్ మీడియా బారిన పడ్డారు. ముఖ్యమంత్రి సతీమణి వైఎస్.భారతి, తల్లి విజయమ్మ, సోదరి షర్మిల వివేకానందరెడ్డి కుమార్తె సునీత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి , కోడలు బ్రహ్మణి , టీడీపీ నాయకురాలు అనిత, పవన్ కళ్యాణ్ కుటుంబంలో మహిళలు గత కొన్నేళ్లలో ఏదొక సందర్భంలో ట్రోలింగ్‌కు గురయ్యారు.ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో తరచూ వీరంతా అవమానాలకు గురవుతూనే ఉంటారు. మీమ్స్ పేరుతో అసభ్యకరంగా వారిని చిత్రీకరించే ప్రయత్నాలకు అడ్డుకునే వారే లేకుండా పోయారు. రాజకీయ నాయకులు స్వయానా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయిరాజకీయ విమర?శల్ని ఎదుర్కొనే క్రమంలో వారి వ్యక్తిత్వాలను కించపరిచేలా దుష్ప్రచారాలు జరుగుతున్నా వాటికి అడ్డుకట్ట వేసే చర్యలు మాత్రం కొరవడ్డాయి. ఈ తరహా ట్రోలింగ్ ముఠాలను అన్ని రాజకీయ పార్టీలు పెంచి పోషిస్తున్నాయనే అపవాదు ఉంది. రాజకీయ ప్రచారాల కోసం ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ సైన్యాలు ఎదుటి వారిని మానసికంగా దెబ్బతీయడం కోసం నిరంతరం దుష్ప్రచారాలు, అసత్యాలపై ఆధారపడుతుంటాయి.రాజకీయ పార్టీల ప్రచారాల కోసం సొంతంగా నడుపుకుంటున్న డిజిటల్ సైన్యాలు ముసుగు ముఖాలతో నకిలీ ఖాతాలతో ఫేస్‌బుక్, ట్విట్టర్లలో చెలరేగిపోతున్నాయి

. మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిలో ఆయా పార్టీలకు చెందిన మహిళలు కూడా ఉండటం గమనార్హం. మహిళలకు చెందిన ఖాతాల నుంచి ఈ తరహా ట్రోల్స్ చేస్తున్నా ఏ రాజకీయ పార్టీ వాటిని ఖండించిన దాఖలాలు లేవు.దొంగ ఖాతాలతో ప్రత్యర్థి పార్టీలకు చెందిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అసభ్యంగా చిత్రీకరించడం, వారి వ్యక్తిగత జీవితాలపై బురద చల్లడం ద్వారా పైశాచిక ఆనందం పొందే ముఠాలను కట్టడి చేయడానికి పోలీస్ శాఖ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.ఈ తరహా ఉదంతాలపై మొదట్లోనే ఉక్కు పాదం మోపి ఉంటే గీతాంజలి వంటి ఘటన జరిగి ఉండేది కాదు. ఏపీలో మహిళలపై జరుగుతున్నంతగా సోషల్ మీడియా దాడులు ఇతర రాష్ట్రాల్లో పెద్దగా కనిపించవు. సోషల్ మీడియాలో ముసుగు ముఖాలతో మహిళలపై దాడులు చేసే వారిని తేలిగ్గానే గుర్తించే అవకాశం ఉన్నా అలాంటి వారిపై తమకు తాముగా పోలీసులు చర్యలు తీసుకున్న సందర్భం ఒక్కటి కూడా లేదు.మహిళల భద్రత,రక్షణ కోసం ఏపీలో దిశ పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఫోన్‌లో బటన్ నొక్కితే ప్రత్యక్షం అవుతామని పోలీస్ శాఖ గర్వంగా చెప్పుకుంటుంది. బహిరంగంగా సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్న వారిని కట్టడి చేసే విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తుంటుంది.

# 15 సీట్లలో టీడీపీ పోటీ

కాకినాడ, మార్చి 14, ఏపీలో అత్యధిక శాసనసభ స్థానాలు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విపక్ష కూటమి సీట్ల సర్దుబాటు దాదాపు పూర్తయింది. ఏ స్థానంలో ఏ పార్టీ బరిలో ఉండాలనే దానిపై పంపకాలు కూడా చేసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి మూడింట రెండొంతుల స్థానాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బరిలో దిగబోతోంది. మొత్తం 21 స్థానాలకు 15 సీట్లలో ఆ పార్టీ పోటీ చేస్తుంది. మిగిలిన ఆరు స్థానాలకు 5 చోట్ల జనసేన అభ్యర్థులు, ఒకచోట బిజెపి బరిలో ఉంటాయి. 2014 ఎన్నికల్లో బిజెపి గెలిచిన రాజమహేంద్రవరం అర్బన్ కావాలని బీజేపీ పట్టుబడుతోదం?. బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఇక్కడ నుంచి పోటీ చేయాలని అనుకుంటున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు సీటు కూడా బిజెపి ఖాతాలో పడడంతో ఎంపీ స్థానం పరిధిలో ఒక అసెంబ్లీ సీటుకి బరిలో ఉండేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. అయితే రాజమండ్రి అర్బన్ కు ఇప్పటికే టీడీపీ టిక్కెట్ ను ఆదిరెడ్డి వాసుకు ప్రకటించారు. ఈ కారణంగా బీజేపీకి ఇచ్చే అవకాశం లేదని.. టిక్కెట్ ప్రకటించినప్పటికీ పోటీకి వెనక్కి తగ్గిన రాజేష్ నియోజకవర్గం పి.గన్నవరం బీజేపీకి కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. జనసేన ఇప్పటికే రాజానగరం, కాకినాడ రూరల్ స్థానాలను ప్రకటించింది. అలాగే జనసేన సిట్టింగ్ సీటు రాజోలులో కూడా ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారు. ఈ మూడు స్థానాలతో పాటు అమలాపురం, పిఠాపురం, రామచంద్రపురం స్థానాల్లో రెండు చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉండే అవకాశం కనిపిస్తుంది. రామచంద్రాపురం కోసం టిడిపి కూడా పట్టుబడుతుంది. శెట్టిబలిజకు జిల్లాలో ఒక సీటు కేటాయించడం అనివార్యం కావడంతో టిడిపి ఆస్థానం కోసం గట్టిగానే ప్రయత్నిస్తుంది. అదే జరిగితే జిల్లాలో మరొక స్థానం జనసేనకు దక్కుతుందా లేక ఐదు సీట్లతో సరు పెట్టుకోవాల్సి వస్తుందా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. తెలుగుదేశం పార్టీ ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ స్థానాల్లో అభ్యర్థులను టిడిపి ఖరారు చేసింది. రాజమహేంద్రవరం సిటీ స్థానాన్ని ఇప్పటికే సిట్టింగ్ ఎంఎల్ఎ భర్త ఆదిరెడ్డి వాసుకు ఖరారు చేసింది. ఆయన ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. కాకినాడ సిటీ విషయంలోనూ టిడిపి భారీగా కసరత్తు చేస్తుంది. జిల్లాలో ఒక్క సీట్ అయినా మత్స్యకారులకు కేటాయించాల్సిన అవసరం ఉండడంతో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేరు ఖరారు చేసే అవకాశం ఎక్కువ ఉంది. ఇక కందుల దుర్గేష్‌కు నిడదవోలు కేటాయించడంతో రాజమహేంద్రవరం రూరల్ స్థానంలో టిడిపి తరపున గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సీటు ఖరారైంది. టిడిపి లిస్టులో 8 స్థానాలకు అభ్యర్థులకు లైన్ క్లియర్ అయ్యింది. మిగిలిన ఏడు సీట్లలో ఎవరికి అవకాశం వస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అందులో ప్రత్తిపాడు, కాకినాడ సిటీ, రామచంద్రపురం, పి.గన్నవరం, గోపాలపురం, కొవ్వూరు ఉన్నాయి. ఈ సీట్లలో ఇప్పటికే ఆశావాహులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు

# అమలాపురం ఆసక్తికరం

రాజమండ్రి, మార్చి 14, తూర్పుగోదావరి జిల్లాలోని మరో నియోజకవర్గం అమలాపురం. ఎస్సీ రిజర్వుడు స్థానమైన ఈ నియోజకవర్గంలో 1952లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. ఇప్పటినివరకు ఈ నియోజకవర్గంలో 16 సార్లు ఎన్నికల జరిగాయి. ఐదుసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టిడిపి, ఒకసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2,41,994 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుష ఓటర్లు 1,20,796 మంది మహిళా ఓటర్లు 1,21,198 మంది ఉన్నారు. అమలాపురం నియోజకవర్గం 1952లో ఏర్పాటు అయింది. తొలిసారి ద్వి సభకు జరిగిన ఎన్నికల్లో ఎస్పిఎఫ్ నుంచి పోటీ చేసిన బి అప్పలస్వామి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పి లక్ష్మణ స్వామిపై 42,808 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేఎంపీపీ నుంచి పోటీ చేసిన ఎన్ రామభద్రిరాజు విజయం సాధించారు. ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కేవీ రావుపై 52,952 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1955లో ద్విసభకు జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసిన బి అప్పలస్వామి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి సిపిఐ నుంచి పోటీ చేసిన ఎస్ఆర్ రావుపై 3036 ఓట్ల తేడాతో విజయం సాధించారు.1955లో సాధారణ సభకు జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసిన జి నరసింహమూర్తి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జి నారాయణదాసుపై 4645 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసిన సూర్యనారాయణ విజయం సాధించారు. ఎన్నికల్లో ఇండిపెండెంట్గా పోటీ చేసిన కే సూర్యనారాయణ విజయం సాధించారు తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఎన్ రామ భద్రిరాజు పై 27 67 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1965లో జరిగిన ఎన్నికల్లో ఎన్ రామభద్రిరాజు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్ గా పోటీ చేసిన కే వెంకటరత్నంపై 4603 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్గా పోటీ చేసిన కే ప్రభాకర్ రావు ఇక్కడ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఎన్ రామభద్రిరాజుపై 3292 ఓట్ల తేడాతో గెలుపొందారు.1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కే ప్రభాకర్ రావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్ గా పోటీ చేసిన ఆర్ రామచంద్రరావుపై 9671 ఓట్లు తేడాతో విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన పీవీ శ్రీరామారావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన డి నాగేశ్వరరావుపై 2408 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన ఎంఎస్ నారాయణరావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కే ప్రభాకరరావుపై 8929 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కే ప్రభాకర్ రావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన ఆర్ రామచంద్రరావుపై 7470 ఓట్ల తేడాతో విజయం సాధించారు.1989లో జరిగిన ఎన్నికల్లో కే ప్రభాకర్ రావు మరోసారి విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ప్రభాకర్ రావు తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన ఎమ్మెస్ నారాయణరావు పై 4273 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన ఎంఎస్ నారాయణరావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కే ప్రభాకర్ రావు పై 16,814 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన ఎమ్మెస్ నారాయణరావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కే ప్రభాకర్ రావుపై 18,780 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసిన కుడిపూడి చిట్టబ్బాయి విజయం సాధించారు.

## డబ్బులునోళ్లకే టిక్కెట్లు

గుంటూరు, మార్చి 14 ఎన్నికల్లో ఆర్థికంగా బలమైన నేతలను బరిలో దించేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఎక్కువ ఖర్చు పెట్టగల సామర్థ్యం ఉన్న నేతలకు పెద్దపీట వేస్తున్నారు. వారికి ఏరి కోరి టిక్కెట్లు ఇస్తున్నారు. అయితే పార్టీ ఫండ్ రూపంలో సైతం కొంత మొత్తం డిపాజిట్ చేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే తాజాగా వైసీపీలో ఈ తరహా ఆరోపణలు బయటకు రావడం విశేషం. టిక్కెట్ల పేరిట పార్టీ ఫండ్ తో పాటు కొంతమంది నేతలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న విషయం బయటపడింది. తాజాగా గుంటూరు జిల్లా చిలకలూరిపేట లో వైసీపీ నేత మల్లెల రాజేష్ నాయుడు ఏకంగా మంత్రి విడదల రజినిపై సంచలన ఆరోపణలు చేశారు. చిలకలూరిపేట టిక్కెట్ ఇప్పించేందుకు తన వద్ద నుంచి 6.5 కోట్లు వసూలు చేశారని ఆయన ఆరోపణలు చేశారు. దీంతో వైసీపీలో వరుసగా విడుదలవుతున్న జాబితాల వెనుక భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ప్రారంభమయ్యాయి.ఇప్పటివరకు వైసీపీ 13 జాబితాలను విడుదల చేసింది. దాదాపు 80 మంది వరకు సిట్టింగ్లను మార్చింది. అయితే ఒక జాబితాలో పేరు.. ప్రకటించి తదుపరి జాబితాలో మార్చుకుంటూ పోతుంది. కొంతమంది ఇన్చార్జిలను నియమించిన అది తాత్కాలికమేనని.. చివరి క్షణంలో ఇతరులు వస్తారని చెప్పుకొస్తోంది. దానికి రకరకాల సమీకరణలను చూపుతోంది. తీరా తొలగించినప్పుడు ఏవేవో కుంటి సాకులు చెబుతున్నారు. అప్పటికే ఇన్చార్జ్ లకు క్షవరం అవుతోంది. టికెట్ కోసం పార్టీకి ఫండింగ్, టిక్కెట్ ఇప్పించారని నేతలకు కమిషన్ కోట్లలో చెల్లిస్తున్నారు. ఫ్లెక్సీలు ఇతరత్రా ఖర్చులకోసం భారీగానే వెచ్చిస్తున్నారు. తీరా చావు కబురు చల్లగా చెబుతున్నారు. టికెట్ లేదని తేల్చేస్తున్నారు. ఇటువంటి బాధితులు వైసీపీలో ఎక్కువగా ఉన్నారు. చిలకలూరిపేటలో మల్లెల రాజేష్ నాయుడు బాధితుడిగా వెలుగు చూశాడు. మంత్రి విడదల రజిని ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఈసారి ఆమెకు టికెట్ ఇవ్వలేదు. ఆమెను గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి పంపించారు. ఆమె స్థానంలో మల్లెల రాజేష్ నాయుడుని నియమించారు. అప్పట్లోనే అందరూ ఆశ్చర్యపడ్డారు. కానీ ఇప్పుడు అందరికీ తెలుస్తోంది. ఆయన వద్ద20 కోట్లకు పైగా వదిలించారని సమాచారం. తనకు జరిగిన అన్యాయం పై ఆయన కార్యకర్తల సమావేశం పెట్టుకొని మరీ బాధపడ్డారు. అంత ఖర్చు పెట్టిన తర్వాత ఆయన స్థానంలో వేరొకరిని ఇప్పుడు ఇన్చార్జిగా నియమించారు. అయితే ఒక్క రాజేష్ నాయుడు బాధితుడు కాదు. ఆయనలా చాలా మంది ఉన్నారు. ఇప్పటివరకు 13 జాబితాలను విడుదల చేశారు. మార్చిన వాళ్ళనే మళ్లీ మళ్లీ మారుస్తున్నారు. ఆర్థికంగా బలమైన వాళ్ళు అని చెప్పి సీటిస్తున్నారు. తరువాత తీసేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కోట్లు రూపాయలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ బ్లాక్ మనీ కావడంతో ఎవరు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

## హలో రామా అంటున్న వైసీపీ నేతలు

నెల్లూరు, మార్చి 14, సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ఏ క్షణమైనా షెడ్యూల్ వెల్లడయ్యే అవకాశం ఉంది. దీంతో వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద స్థాయి నాయకులకు గెలుపోటములపై భయం ఉండగా.. ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఆవేదనతో ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలామంది నేతలు దూకుడుగా వ్యవహరించారు. ముందూ..వెనుక చూసుకోకుండా ఇక అంతా మాదే అన్నట్టు నడుచుకున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల నుంచి.. కరోనా సేవల వరకు చాలా డబ్బులు ఖర్చు చేశారు. కానీ రోజులు నెలలుగా మారాయి.. నెలలు సంవత్సరాలయ్యాయి. ఇప్పుడు ఎన్నికలు సమీపించాయి. కానీ ఇంతవరకు బిల్లుల చెల్లింపు లేకుండా పోయాయి. అస్మదీయ కంపెనీలకు మాత్రం రుణాలు తెచ్చి మరి చెల్లింపులు చేశారు. కానీ పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులను మాత్రం దారుణంగా వంచించారు.మరి కొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ రానుంది. ఎటువంటి ప్రభుత్వ చెల్లింపులకు అవకాశం ఉండదు. అందుకే చేసిన పనులకు బిల్లులు చెల్లించండి అంటూ వేలాదిమంది వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు పెద్ద నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. వారిపై ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం మారితే పైసా కూడా ఎవరని ఆందోళన చెందుతున్నారు. అయితే గత ప్రభుత్వాలు.. ముందు ప్రభుత్వాలు చేసిన పనులకు బిల్లులు చెల్లించేవి. జగన్ సర్కార్ ఆ సంప్రదాయాన్ని మార్చేసింది. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించలేదు. బాధితులు కోర్టులకు వెళ్లినా..వారికి న్యాయం జరగలేదు. దీంతో రేపు టిడిపి ప్రభుత్వం వచ్చిన అదే పని చేస్తుందని వైసిపి చోటా నేతలకు తెలుసు. అందుకే వారు ఆందోళన చెందుతున్నారు.వివిధ ప్రభుత్వ పథకాల్లో భాగంగా వేలకోట్ల రూపాయల పనులు చేసిన అస్మదీయ కంపెనీలకు బిల్లులు చెల్లించారు. అప్పులు తెచ్చి మరి కట్టబెట్టారు

## డైరక్ట్ ఎన్నికల్లో సుజనా, సీఎం రమేష్

విజయవాడ, మార్చి 14, వాళ్లిద్దరూ ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ నేతలు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో బీజేపీలో చేరారు. వారి రాజకీయ జీవితంలో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే కొన్ని ఏళ్ల తర్వాత వాళ్లిద్దరూ ప్రత్యక్ష ఎన్నికలలో పోరాడేందుకు బరిలోకి దిగినట్లు స్పష్టమవుతుంది. వాళ్లే మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి, సీఎం రమేష్. బీజేపీ నుంచి రానున్న ఎన్నికల్లో ఈ ఇద్దరు నేతలు పార్లమెంటు ఎన్నికల్లో పోటీకి దిగడానికి సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. బీజేపీకి కేటాయించిన సీట్లలో వాళ్లిద్దరూ బరిలోకి దిగుతారని పార్టీలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. సుజనా చౌదరి, సీఎం రమేష్‌లు తెలుగుదేశం పార్టీకి ఒకప్పుడు నమ్మకమైన నేతలు. బ్యాక్ ఆఫీస్ లో ఉంటూ పార్టీకి అన్ని రకాలుగా సాయం అందించేవారు. ఆర్థికంగా మాత్రమే కాకుండా సామాజికవర్గం పరంగా కూడా బలమైన నేతలు. టీడీపీకి ఆర్థికంగా వెనక ఉండి సాయం అందిస్తూ వ్యాపారపరంగానే లబ్ది పొందేవారు. అంతే తప్ప చంద్రబాబును తమకు ఏనాడూ రాజకీయాల్లో స్థానంకల్పించాలని కోరలేదు. అభ్యర్థుల ఎంపికలోనూ వాళ్లిద్దరూ 2014, 2019 ఎన్నికల్లో కీలకంగానే ఉన్నారు. స్క్రీనింగ్ కమిటీలో సుజనా చౌదరి సభ్యుడిగా కూడా ఉన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత రాజ్యసభ సభ్యులుగా ఉన్న వీళ్లిద్దరూ బీజేపీలో చేరిపోయారు. సుజనా చౌదరి కృష్ణా జిల్లాకు చెందిన వారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన నేత మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా బలమైన నేత. ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆయన ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడటంతో తమ గెలుపు గ్యారంటీ అన్న నమ్మకంతో సుజనా చౌదరి ఉన్నారు. విజయవాడను వదులుకునేందుకు టీడీపీ సిద్ధపడకపోవడంతో మరో సేఫ్ ప్లేస్ ఏలూరు అని ఆయన భావిస్తున్నారని తెలిసింది. బీజేపీ అధినాయకత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభిస్తే సుజనా చౌదరి రానున్న ఎన్నికల్లో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశముంది. ఇక సీఎం రమేష్ కాపు సామాజికవర్గానికి చెందిన నేత. కడప జిల్లాకు చెందిన లీడర్. టీడీపీకి ఆర్థికంగా ఎన్నో సార్లు వెన్నుదన్నుగా నిలిచారు. చంద్రబాబుకు నమ్మకమైన నేతగా కొనసాగారు. అయితే ఆయన ఏనాడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆయన కూడా ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. అనకాపల్లి నుంచి బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నట్లు తెలిపారు. అనకాపల్లి నుంచి జనసేన అభ్యర్థిగా నాగబాబు బరిలోకి దిగాలనుకున్నప్పటికీ ఆ స్థానాన్ని బీజేపీ కోరడంతో అందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. దీంతో సీఎం రమేష్ అనకాపల్లి నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారనితెలిసింది. మొత్తం మీద ఇద్దరు కీలకనేతలు తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## వైకాపా, రాజకీయాలకు దూరం

### ఎమ్మెల్యే రక్షణ నిధి

తిరువూరు,తిరువూరు ఎమ్మెల్యే-కొక్కిలిగడ్డ రక్షణనిధి మీడియాతో మాట్లాడారు. తిరువూరు నియోజకవర్గంలో పదేళ్లు పాలన పూర్తయింది. తాను వచ్చిన వెంటనే మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. క్యాడర్ అందర్నీ ప్రజా ప్రతినిధులుగా చేశాం. మున్సిపల్ ఒడాం,పంచాయితీలు ఓటమి చూశాం,కానీ ఎమ్మెల్యే గా మాత్రం క్యాడర్ సహకారంతో గెలిచాం. ప్రతి పక్షంలో ఉన్నవారు సైతం మా గెలుపుతో భాగస్వామ్యం అయ్యారని అన్నారు. పార్టీ కార్యక్రమాల్ని తుచా తప్పకుండా చేశాం..క్యాడర్ ను బలోపేతం చేశాం. మున్సిపాలిటీనీ ఓన్ సైడ్ గా గెలిపించడం జరిగింది. 63 ఎంపీటీసీ లకు 61గెలిచాం, నాలుగు జడ్పీటీసిలను గెలవడం జరిగింది. తన సొంత నిధులతో పార్టీ కొరకు ఆర్థికంగా,అహర్నిశలు ఖర్చు చేశామని అన్నారు.చైర్మన్ పీఠం మార్పు కోసం 16 మంది కౌన్సిలర్ల ఆమోదంతో మరొకరికి అవకాశం కల్పించేందుకు చూశాం.అధిష్టానం ఆదేశాలతో నిలిచిపోయింది. కష్టపడితేనే సీటు అన్నారు. ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా ప్రతి గడప గడపకు కష్టపడ్డాను.. సీఎం జగన్ రివ్యూ పెట్టారు. ప్రతి రివ్యూ లో మొదటి పది స్థానాల్లో నేను ఉన్నాను. 59% నన్నే కావాలని చేసిన సర్వేలలో తేలింది. అభ్యర్థి నేనే అని చెప్పారు..కానీ మళ్లీ సర్వే చేశారు. అసలు అభ్యర్థుల్లో పరిచయం లేని వారి పేర్లను ఐవిఆర్ఎస్ సర్వేల్లో పెట్టారు. అధిష్టానానికి విధేయుడుగా ఉన్న నన్ను ప్రక్కన పెట్టేందుకు మర్మం ఏమిటి..? పార్టీ నమ్ముకుని ఉన్న నన్ను ఐపాక్ రిపోర్ట్ ఫాలో అవుతున్నా అని అధిష్టానం చెప్పింది. ఐప్యాక్ సర్వేల్లో నేనే మొదటి స్థానంలో మరి దానిని ఎందుకు పరిగణలోకి ఎందుకు తీసుకోలేదు..నేను నేనుగా మానేశాను.. ప్రజలకు వివరణ ఇవ్వాలి కాబట్టి చెబుతున్నా. సామాజిక న్యాయం ద్వారా అందరికీ పదవులు ఇచ్చాను, నాలా మరొకరు ఉండరు. ఎమ్మెల్యేగా నాపైనే సర్వే చేశారు సర్వే ఆధారం 69% కావాలని తేలింది. మిగతా వారికి 6% ఉందని అన్నారు. మాత్రమే పోటీ చేయడం లేదు, అంతే నాకు టికెట్ లేదని కాదు.నామనస్సుగాయపడింది అందుకే మౌనంగా ఉన్నా. వాస్తవాలు ప్రజలకు తెలియాలి అందుకే మీడియా సమావేశమని వివరణ ఇచ్చారు. 2014,19 ఎన్నికల్లో పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి నాకు పూర్తిగా సహకరించారు. మేము ఏమైనా చెబుతాం అంటే సీఎం జగన్ కలిసేందుకు అపాయింట్మెంట్ లేకుండా పోయింది. కేంద్రంలో ప్రధాని మోడీ బ్రహ్మాండంగా పాలన చేస్తున్నారు. ఆయనే రావాలని నేను కోరుకుంటున్నా. వైఎస్ఆర్ పార్టీ,రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని రక్షణ నిధి అన్నారు.

## తిరుపతి బాల మందిర్ పాఠశాలలో 4 తరగతి విద్యార్థి మిస్సింగ్..

### భాకరపేట చెరువులో మృతదేహం లభ్యం

తిరుపతి,తిరుపతిలోని బాల మందిర్ పాఠశాల బాలుడు మిస్సింగ్ అయ్యాడు. రేణిగుంట బుగ్గ వీధికి చెందిన 4 వ తరగతి చదువుతున్న కె.ముని నిరంజన్ (9), బాల మందిర్ పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థి. అదే పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి సతీష్ తో పాటు భాకరాపేటకు ముని నిరంజన్ వెళ్లాడు. బాలుడిని భాకరాపేటలో బస్సు ఎక్కించి పంపినట్లు సతీష్ చెబుతున్నాడు. బాలుడి ఆచూకీ దొరకకపోవడంతో వెస్ట్ పోలీస్ స్టేషన్ లో తల్లి స్వాతి ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఉదయం భాకరాపేట చెరువులో ముని నిరంజన్ మృతదేహాన్ని భాకరాపేట పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ముద్రగడ యూ టర్న్...



కాకినాడ, మార్చి 14 ఏపీలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఈరోజు ఉన్న రాజకీయాలు రేపటికి మారిపోతున్నాయి. రేపు వైసీపీలో చేరతానన్న ముద్రగడ పద్మనాభం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. ఈనెల 14న వైసీపీలో చేరతానని ముద్రగడ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై అభిమానులకు పెద్ద ఎత్తున పిలుపునిచ్చారు కూడా. ఈ ప్రయాణంలో తనతో భాగస్వామ్యం కావాలని కోరారు.అయితే ఇంతలో 14వ తేదీ తాను వైసీపీలో చేరడం లేదని.. 15వ తేదీ లేదా 16న చేరతానని ప్రత్యేకంగా ప్రకటన విడుదల చేయడం విశేషం.ఏపీ రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభం ఎపిసోడ్ కొలిక్కి రావడం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని తెరపైకి తెచ్చారు. పతాక స్థాయికి తీసుకెళ్లగలిగారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నపలంగా ఉద్యమాన్ని నిలిపివేశారు.గత నాలుగున్నర సంవత్సరాలుగా ముద్రగడ వైసీపీలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ అటువంటిదేమీ జరగలేదు.అయితే ఎన్నికల ముందు వైసీపీలో చేరడం లాంఛనమేనని టాక్ నడిచింది. అయితే టిక్కెట్ల కేటాయింపులో ముద్రగడ కుటుంబాన్ని వైసిపి హై కమాండ్ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఆయన అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. వైసిపి నేతలను కలవడానికి కూడా ముద్రగడ ఇష్టపడలేదని టాక్ నడిచింది. అదే సమయంలో జనసేనలోకి రావాలని ఆ పార్టీ నేతలు ముద్రగడను ఆహ్వానించారు. జనసేన అభ్యర్థనను ఆయన సానుకూలంగా స్పందించినట్లు వార్తలు వచ్చాయి. అయితే పవన్ నుంచి ఆశించిన స్థాయిలో సుముఖత రాకపోవడంతో నొచ్చుకున్న ముద్రగడ వైసీపీలోకి వెళ్తానని తేల్చి చెప్పారు. ఈనెల 14న వైసీపీలోకి వెళ్ళనున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. దానికి భద్రతా చర్యలను కారణంగా చెబుతున్నారు.తాజాగా అభిమానులకు ముద్రగడ ఒక లేఖ రాశారు. రేపు తాడేపల్లి కి వెళ్లేందుకు ఆయన ప్లాన్ చేసుకున్న ర్యాలీని రద్దు చేసుకున్నట్లు వెల్లడించారు. కేవలం తాను ఒక్కడిని మాత్రమే తాడేపల్లి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరతానని ప్రకటించారు. తాను ఊహించిన దానికన్నా భారీ స్థాయిలో స్పందన రావడం మీదట.. వారికి సెక్యూరిటీ ఇబ్బంది ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కువమంది వస్తే కూర్చోడానికి కాదు, నిలబడడానికి కూడా స్థలం సరిపోదని.. వచ్చిన ప్రతి ఒక్కరిని చెక్ చేయడం చాలా ఇబ్బంది అని చెప్పడంతోనే ర్యాలీని రద్దు చేసుకున్నట్లు స్పష్టం చేశారు. తన అభిమానులకు నిరుత్సాహపరిచినందుకు క్షమాపణ కోరారు. మీ అందరి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అయితే సడన్ గా ముద్రగడ యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. దీని వెనుక ఏమైనా జరిగి ఉంటుందా అన్న అనుమానం కలుగుతుంది.

# పవన్ చెవిలో కమలం పువ్వు

విజయవాడ, మార్చి 14, అవును... ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఎక్కడ విన్నా ఇదే చర్చ. అసలు బలం లేని బీజేపీ మాత్రం పట్టుబట్టి పది అసెంబ్లీ స్థానాలను దక్కించుకుంది. ఆరు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి సిద్ధమైంది. బెట్టు చేసి మరీ పంతాన్ని నెగ్గించుకుంది. అవసరం ఇద్దరికీ ఉంది. కానీ ఎక్కువ అసవరం తమ కన్నా మీకే అన్న సంకేతాలను భారతీయ జనతా పార్టీ నాయకత్వం బలంగా పంపగలిగింది. కానీ బీజేపీ కంటే బలముండి.. పవన్ అండ అవసరం ఎక్కువగా ఉన్నప్పటికీ జనసేనాని మాత్రం తెలుగుదేశం పార్టీకి లొంగిపోయాడన్న విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. బీజేపీకి ఉన్న దూర దృష్టి కూడా పవన్ కల్యాణ్ కు లేకపోవడం తమ దురదృష్టమంటూ జనసైనికులు తలలు పట్టుకుంటున్నారు.నిజానికి ఈ ఎన్నికలు టీడీపీకి చావో రేవో. అతి ముఖ్యమైన ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ను కలుపుకుని వెళ్లడం తెలుగుదేశం పార్టీకి అవసరం కూడా. జగన్ ను ఎదుర్కొనాలన్నా, బలమైన కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకును తమ వైపునకు తిప్పుకోవాలన్నా పవన్ కల్యాణ్ అవసరమే టీడీపీకి ఎక్కువగా ఉంది. అందుకే తొలి నుంచి జనసేన పార్టీ నేతలు ఈసారి ఎక్కువ స్థానాలు తమకు దక్కుతాయని భావిస్తూ వచ్చారు. పవన్ కల్యాణ్ కూడా తరచూ తనకంటూ ఒక వ్యూహం ఉందని చెబుతుండటంతో పిచ్చిగా నమ్మేశారు. కానీ చివరాఖరకు మాత్రం 24 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంటు స్థానాల్లోనే పోటీ చేస్తామని చెప్పడంతో నేతలు, క్యాడర్ నిరాశకు లోనయ్యారు. ఇప్పుడు ఆ సంఖ్యను కూడా తగ్గించుకున్నారు.మరోవైపు బీజేపీకీ ఏపీలో నోటా కంటే ఎక్కువ ఓట్లు లేవు. పైగా కాంగ్రె?స్ తరహాలోనే బీజేపీకి కూడా ఇక్కడ బలమైన నేతలు కూడా లేరు. కానీ కేంద్రంలో అధికారంలో ఉండటం, మళ్లీ మోదీ సర్కార్ వస్తుందన్న అంచనాలు మాత్రమే దానిని సీట్ల కోసం డిమాండ్ చేసేలా నిలబెట్టాయి. ఢిల్లీలో దాదాపు మూడు రోజులు మకాం వేసి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సీట్ల సర్దుబాటు చేసుకుని వచ్చారు. సరే... బలం లేని బీజేపీకి అన్ని సీట్లు ఇవ్వడమేంటన్న చర్చ టీడీపీ, జనసేన పార్టీల్లో జరుగుతుంది. పడిగాపులు కాచి మరీ పొత్తు కన్ఫర్మ్ చేసుకుని బలానికి మించి బీజేపీ ఎక్కువ సీట్లను ఇచ్చారన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. కేవలం అంకె మాత్రమే కాదు.. టీడీపీ, జనసేన బలమున్న స్థానాలను కూడా ఆ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలియవచ్చింది.

ఇలాంటి సమయం... బీజేపీతో అవసరానికి మించి సీట్ల సర్దుబాటు చేసుకున్నారన్న వ్యాఖ్యలు రెండు పార్టీల నుంచి వినిపిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికపరంగా ఆ పార్టీకి బలమైన నేతలు లేరు. అలాగే క్రౌడ్ పుల్లర్లు కూడా ఎవరూ లేరు. అయినా సరే.. బీజేపీ పట్టుబట్టి మరీ సీట్లను సాధించుకుంది. కానీ పవన్ కల్యాణ్ మాత్రం తన అవసరం టీడీపీకి ఉన్నా, బలమైన ఓటు బ్యాంకును భుజాన పెట్టుకుని ఉన్నప్పటికీ కనీస స్థానాలను సాధించడంలో విఫలమయ్యారన్నది వాస్తవం. అదే ఇప్పుడు కాపు సామాజికవర్గంలో పవన్ కు మైనస్ గా మారబోతుందంటున్నారు. డిమాండ్ చేసి మరీ సాధించుకోవాల్సిన ఇలాంటి సమయం మరెప్పుడూ పవన్ కల్యాణ? కు రాదన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. మొత్తం మీద పట్టున్న పవన్ కల్యాణ్ కంటే.. బలం లేని బీజేపీయే బెటర్ అంటూ నెట్టింట ఆ పార్టీ ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు

# ఎన్నికల బరిలోకి కోడికత్తిశీను, దస్తగిరి

విజయవాడ, మార్చి 14, సీపీ అధినేత, సీఎం జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో విజయంకోసం అనేక అడ్డదారులు తొక్కారన్న విమర్శలు ఉన్నాయి.విపక్షాలు అవి కేవలం విమర్శలు కావు, వాస్తవాలు అంటూ పలు ఉదాహరణలు చూపుతున్నారు. ఇంతకీ జగన్ గత ఎన్నికల్లో అంతలా ఏం చేశారు. ఆయన విజయంలో కీలక భూమిక పోషించిన అంశాలు ఏమిటి ? అన్న ప్రశ్నకు ఏపీ రాజకీయాలపై అవగాహన ఉన్నవారికి వెంటనే గుర్తుకు వచ్చేవి బాబాయ్ హత్య, కోడికొత్తి దాడి. ఈ రెండు ఘటనలు 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని విజయతీరాలకు చేర్చడంలో కీలక భూమిక పోషించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే.. వైసీపీ అధికారంలోకి రావడంతోపాటు, భారీ సంఖ్యలో అసెంబ్లీ, ఎంపీ సీట్లను గెలుచుకోవడానికి ఈ రెండు ఘటనలు ఎంతో దోహదపడ్డాయి. అయితే ఆ రెండు ఘటనలుకూడా జగన్ మోహన్ రెడ్డి కనుసన్నల్లోనే జరిగాయన్నవిమర్శ:లు అప్పటి నుంచీ ఉన్నాయి. ఆ విమర్శలు కేవలం విమర్శలు కావు, వాస్తవమే అనిపించేలా ఈ ఐదేళ్లలో ఆ కేసుల విషయంలో జరిగిన పరిణామాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన విషయాలు ఉన్నాయి. దీంతో జగన్ తాను తీసుకున్న గొయ్యిలో తానే పడబోతున్నాడని పరిశీలకులే కాదు, సామాన్య జనం కూడా అంటున్నారు.2019 ఎన్నికల్లో వైసీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి.. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య, మరోవైపు కోడికత్తి దాడి ఘటనలు ఎంతో దోహపడ్డాయి. గత ఎన్నికల సమయంలో వివేకానంద రెడ్డి హత్యకేసు ఏపీ రాజకీయాల్లో పెను సంచలనాన్నే సృష్టించింది. అప్పట్లో వివేకాను హత్య వెనుక అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన అనుచరులే ఉన్నారని ప్రజలు నమ్మేలా చేయడంలో జగన్మోహన్ రెడ్డి విజయం సాధించారు. అయితే, ఇటీవల కాలంలో వివేకా హత్య కేసులో బయటపడుతున్న నిజాలు ఏపీ ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి. వివేకా హత్య కేసులో జగన్ ప్రోత్సాహం, అవినాశ్ ప్రమేయం ఉందని ఆ కేసు దర్యాప్తులో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ కేసులో నిందితుడుగా ఉన్న దస్తగిరి అప్రూవర్ గా మారాడు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్రస్తుతం దస్తగిరి సైతం జగన్ మోహన్ రెడ్డికి గట్టి సవాల్ విసురుతున్నాడు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జగన్ రెడ్డిపై పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. జై భీమ్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు దస్తగిరి ప్రకటించాడు.మరోవైపు కోడికత్తి కేసులో ముద్దాయిగా ఉన్న శ్రీనివాస్ బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అద్భుత విజయం సాధించటంలో కోడికత్తి శ్రీనివాస్ ది కూడా కీలక భూమిక అని అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. జగన్ ఎలాగైనా 2019 ఎన్నికల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ఎయిర్ పోర్టులో జగన్ పై కోడికత్తితో శ్రీనివాస్ దాడికి ప్రయత్నించాడు. ఈ దాడిలో జగన్ మోహన్ రెడ్డి భుజానికి స్వల్ప గాయమైంది. అప్పట్లో తనపై దాడిచేయించింది చంద్రబాబు, ఆయన మనుషులే అంటూ ఊరూ వాడా ఏకమయ్యేలా ప్రచారం చేసుకుని ప్రజల సానుభూతి పొందిన జగన్మోహన్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అయితే, కోడికత్తి కేసులో నిందితుడైన శ్రీను మాత్రం.. జగన్ పై ప్రజల్లో సింపతీ రావాలనే తాను అలా చేశానని చెప్పాడు. తాజాగా కోడికత్తి శ్రీను.. అసెంబ్లీలో ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి బరిలో నిలిపిన అభ్యర్థిని ఓడించేందుకు పోటీ చేయబోతున్నాడు. కొడికత్తి శీను కూడా జైభీమ్ భారత్ పార్టీలో చేరి అమలాపురం నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నట్లు ప్రకటించాడు. 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి విజయానికి దోహదపడిన ఈ రెండు ఘటనల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులూ కూడా 2024 ఎన్నికల్లో జగన్ కు వ్యతిరేకంగా పోటీలో నిలవనుండడంతో జగన్ శిబిరంలో ఆందోళన వ్యక్తమవుతోంది. పులివెందులలో దస్తగిరి, అమలాపురంలో కోడికత్తి శ్రీను ఇద్దరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సమయంలో.. జగన్ మోహన్ రెడ్డిపై ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారోనన్న భయం వైసీపీ నేతలను వెంటాడుతున్నది. ఎన్నికల వేళ వారిద్దరూ నిజాలను ప్రజలకు వెల్లడిస్తే, ఆ రెండు ఘటనల్లో జగన్ ప్రమేయం ఉందని చెబితే వైసీపీని ప్రజలు చీదరించుకుంటారన్న ఆందోళన జగన్ లోనూ ఆయన శిబిరంలోనూ వ్యక్తం అవుతోంది.ఇప్పటికే జగన్ ఐదేళ్ల అక్రమ, అరాచక పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. దీంతో ఇప్పటికే ఓటమి ఖాయమైంది. తాజాగా వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు, కోడికత్తి కేసులో ప్రధాన నిందితుడు ఇద్దరూ ఎన్నికల బరిలో నిలిచి ఆ కేసులకు సంబంధించిన నిజాలను బయటపెడితే ఇక వైసీపీకి పడతాయనుకుంటున్న కాసిని ఓట్లు కూడా పడవన్న ఆందోళన వైసీపీ అభ్యర్థులను వెంటాడుతున్నది. ఏపీలో తాజా పరిస్థితిని గమనిస్తున్న ప్రజలు.. జగన్ తీసిన గొయ్యిలో ఆయనే పడబోతున్నారంటున్నారు.

## నెల్లూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్..

నెల్లూరు,ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ నెల్లూరులో పర్యటించారు. శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన ఖఓ సూరజ్ పోర్టల్ ప్రారంభ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. విజయవాడ నుండి హెలికాప్టర్లో పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో దిగిన అబ్దుల్ నజీర్ దంపతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ హరి నారాయణ్, ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.

## అందరినీ కలుపుకుంటా..విజయం సాధిస్తా

విశాఖ,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ హైదరాబాద్ నుండి ఇండిగో విమానంలో విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. వైసిపి అధిష్టానం గాజువాక సమన్వయకర్తగా నియమించిన తర్వాతఅయన మొదటిసారిగా విశాఖ చేరుకున్నారు. భారీ సంఖ్యలో అమర్ కి ఘన స్వాగతం పలికేందుకు వైసిపి పార్టీ కార్యకర్తలు, అభిమానులు మహిళా నాయకులు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అమర్నాథ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఏ బాధ్యత అప్ప చెప్పినా ఆ బాధ్యత చేయడానికి అమర్నాథ్ ఎప్పుడు సిద్ధంగా ఉంటాడు. పోటీలో నిలబడి పోరాటం చేయడం పోటీనుంచి తప్పుకునైనా జగన్ కోసమే పని చేస్తాను. అమర్ ని నా గుండెలో పెట్టుకొని మంచి చేస్తానని మాట జగన్మోహన్ రెడ్డి చెప్పారు. నేను పుట్టి పెరిగిన ప్రాంతంలో పోటీ చేసే అవకాశం జగన్మోహన్ రెడ్డి కల్పించారు. నియోజకవర్గంలో ఉన్న అందర్నీ కలుపుకుంటూ నాపై జగన్మోహన్ రెడ్డి ఉంచిన నమ్మకానికి గెలిచి గిఫ్ట్ గా ఇస్తానని అన్నారు.

## హామీలను అమలు చేసిన నేత జగన్

విజయనగరం పేదలు పక్ష పాతి, ఇచ్చిన హామీలను అమలు చేసిన నాయకుడు సిఎం జగ న్మోహన్రెడ్డి అని వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధా ర్థ రెడ్డి అన్నారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో విజయనగరం లో యువజన భేరి ర్యాలీ, సభను నిర్వ హించారు. స్థానిక వెంకటలక్ష్మి జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ,మూడు లాంతర్లు వరకు జరిగింది. మూడు లాంతర్లు వద్ద జరిగిన బహిరంగ సభ లో ఆయన మాట్లాడుతూ దొంగ హామీ లు ఇచ్చి అధికారంలోకి రావాలని చంద్రబాబు చూస్తున్నాడని విమర్శిం చారు. వైసిపికి అనుకూలంగా మాట్లా డిందని ఒక అమాయకురాలైన మహిళను వేధించి చంపేశారన్నారు. జగన్మోహన్రెడ్డి కనుసైగ చేస్తే ఎవరిని ఎక్కడ పెట్టాలో అక్కడ పెడతామన్నా రు. సంక్షేమ ,అభివృద్ధి ఎంత ముఖ్యమో శత్రువులను తొక్కడం కూడా అంతే అవసరం ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన కళ్యాణ్ చేసిన తప్పులను ప్రశ్నిస్తున్నందునే జగన్ మంచోడు కాదని అంటున్నారని అన్నారు. మోడీని ఉగ్రవాది అని , భార్యను చూసుకోలేని వాడు దేశానికి ప్రధానిగా ఏమి చేస్తాడని తిట్టిన చంద్రబాబు నేడు బిజెపితో కలిశాడన్నారు.

## పవన్ సొంత జిల్లాలో జనసేన కు ఐదు సీట్లు ఖరారు

కొవ్వూరు,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాల్లో ఐదింట జనసేన పోటీ చేయనుంది. ఐదుగురు నేతలకు మంగళగిరి లో అభ్యర్థిత్వం జనసేనాని పవన్ ఖరారు చేసారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి అంజిబాబు కు భీమవరంలో ఘనస్వాగతం లభించింది. భీమవరం లో భారీ మెజారిటీతో గెలుస్తామని అంజిబాబు అంటున్నారు. నరసాపురం నుండి బొమ్మిడి నాయకర్, తాడేపల్లిగూడెం నుండి బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుండి పత్సమట్ల ధర్మరాజు, నిడదవోలు నుండి కందుల దుర్గేష్ అభ్యర్థులుగా ఖరారు చేశారని అంజిబాబు మీడియాకు వెల్లడించారు.

## రాజోలు మిత్ర పక్షాల ఉమ్మడి అభ్యర్థిగా దేవా వరప్రసాద్

రాజోలు,రాజోలు నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పార్టీ జనవాణి కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి దేవా వర ప్రసాద్ పేరు ఖరారు అయింది. అభ్యర్థిత్వం ఖరారు చేసుకుని నియోజకవర్గానికి మలికిపురం విచ్చేసిన సందర్భంగా ఆయనకు పలికిన జనసేన, టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తనకు అవగాహన ఉందని, గత ఐదేళ్లలో ఏమి అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు.. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తాను. రాబోవు ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుస్తామని ధిమా వ్యక్తం చేసారు.

## బాలయ్య హ్యాట్రిక్ కొట్టడం ఖాయం

హిందూపురం ,హిందూపురంలో నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ఆయన సతీమణి వసుంధర తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో బాలకృష్ణ భార్య వసుంధరా దేవి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ టీడీపీ శ్రేణుల్లో జోష్ పెంచుతున్నారు. ఒక రకంగా బాలయ్య తరుఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోంది. బాలకృష్ణ హయాంలోనే హిందూపురం అభివృద్ధి జరిగిందని వసుంధరా దేవి చెప్పారు. హిందూపురం ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తాగునీటి ప్లాంట్లు సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఆస్పత్రిని అభివృద్ధి చేసినట్లు వసుంధర గుర్తు చేశారు. అలాగే మొబైల్ ఆరోగ్య సేవలు, క్యాన్సర్ చికిత్స అందించిన ఘనత బాలకృష్ణదేనని తెలిపారు. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ఇప్పటికీ కొనసాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. హిందూపురం అభివృద్ధికి బాలకృష్ణ చేసిన సేవలకు గుర్తింపుగా మరోసారి ఆయన విజయం సాధించడం పక్కానని వసుంధర ధీమా వ్యక్తం చేశారు. హిందూపురం నుంచి బాలయ్య హ్యాట్రిక్ కొట్టడం గ్యారెంటీనని ఆమె తెలిపారు.

## కుప్పంలో సర్పంచ్ భార్య పైన సొంత పార్టీ వ్యక్తులే బూతుల వర్షం

కుప్పం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ప్రశ్నస్తే సొంత పార్టీ మహిళలైన ఎవరైనా ఒక్కటే వైసీపీ కి బూతులతో రెచ్చిపోయారు. కనీసం మహిళలు అని కూడా చూడకుండా సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు. తాజాగా శాంతిపురం మండలం మోరసనపల్లి పంచాయితీ వైసీపీ సర్పంచ్ జగదీష్ భార్య నీల ను వైకాపా నేతలే భయంకరంగా ట్రోల్ చేస్తున్నారు. అభివృద్ధి ఏది అని ప్రశ్నిండమే ఆమె చేసిన తప్పు. ఈ మేరకు ఆమె ఒక సెల్ఫీ విడుదల చేసారు. తన మీద వైసీపీ సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులను స్వయంగా ఆమె స్క్రీన్ షాట్ తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వైసీపీ బ్యాచ్ పెట్టిన పోస్టులు చూస్తుంటే మహిళల మీద వారికున్న అభిప్రాయం ఇట్టే తెలుస్తోందని అన్నారు.

## హామీలను నూరు శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్ దే:ఇంచార్జ్ దవులూరి



సామర్లకోట శ్రీ ప్రస్థానం ప్రతినిధి:ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని పెద్దాపురం నియోజవర్గ ఇంచార్జ్ దవులూరి దొరబాబు అన్నారు.గురువారం సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో చంద్రంపాలెం ,నవర ,గొంచాలా ,అచ్చంపేట,ఉండూరు,వేమవరం, కాపవరం,పనసపాడు,పవర,పంద్రవాడ గ్రామాల్లో అందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన రిజిస్ట్రేషన్ పట్టాలను దొరబాబు పంపిణీ చేశారు.ఈ పథకం కింద ఇచ్చే పట్టాలకు విలువ లేదన్న ప్రతిపక్షాల విమర్శ లకు దీటుగా వాటికి రిజిస్ట్రేషన్ చేయించి సొంత ఆస్తిపై సర్వ హక్కులు కల్పించి ప్రభుత్వం అక్కచెల్మమ్మలకి అందజేయడం జరుగుతుందని దవులూరి దొరబాబు అన్నారు.రాబోయే సార్వత్రిక ఎన్నికలలో స్థానికుడైన నాకు సహకరించాలని వైసీపీ విజయానికి కృషిచేసి జగన్ ను సీఎం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు,జడ్పీటీసీ ఎలిసెట్టి అమృత నరేష్,ఎమ్మార్వో శ్రీనివాన్, ఎంపీడీవో శ్యాంసుందర్,ఎంపీటీసీలు,గ్రామ సర్పంచులు,వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

## వేట్లపాలెం సర్పంచ్ పదవి మూడు నెలలు రద్దు

సామర్లకోట శ్రీ ప్రస్థానం ప్రతినిధి:మండల పరిధిలో వేట్లపాలెం సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి పదవిని మూడు నెలల పాటు రద్దు చేశారు.ఈ మేరకు ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల ఏడవ తేది నుంచి జూన్ ఆరవ తేదీ వరకు పదవిని రద్దు చేయడం జరిగింనన్నారు.ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ ను ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టరు కృతికాశుక్లా నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.ఉప సర్పంచ్,ఈఓపీఆర్డీ లకు చెక్కు పవర్ ఇవ్వడం జరిగిందని చెప్పారు.ఈ మేరకు ఉప సర్పంచ్ ఇన్చార్జి సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించారు.

## కమనీయం..రమణీయం..శ్రీ శ్రీ శ్రీ గంగాభవానిదేవి రథోత్సవం..!





శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్: పెద్దకడుబూరు మండల పరిధిలోని బాపురం గ్రామంలోవెలసిన శ్రీ శ్రీ శ్రీ గంగాభవానిదేవి రథోత్సవం గురువారం సాయంత్రం అశేష భక్త జనవాహినుల మధ్య అత్యంత వైభవంగాను కమనీయం... రమణీయంగా కన్నులపండుగలాగ కొనసాగింది. ముందుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శ్రీ శ్రీ శ్రీ గంగాభవానిదేవికి ఆకుపూజ. కుంకమార్చన. పంచామృతాబిషేకం. బిల్వార్చన. గంగపూజ. వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6గంటల ప్రాంతంలో శ్రీ గంగాభవానిదేవి మఠంనుండి. శ్రీ గంగా భవాని దేవికి పీఠాధిపతిరాలు శ్రీ బసలింగమ్మవ్వ ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత శ్రీ గంగాదేవిని భక్తులు పల్లకి సేవలో ఉంచి మఠంనుండి బసలింగమ్మవ్వను మేళతాళలతోను భజంత్రీలతో ఊరేగింపుగా వెల్లి స్థానిక పుష్పరథానికి నైవేద్యం సమర్పించి అనంతరం శ్రీ గంగాదేవిప్రతిమను రథంపైఉంచి రథాన్ని బసవన్న కట్ట వద్దకు లాగి మళ్లీ యథాస్థానంలో ఉంచారు. ఈరథాన్ని తిలకించేందుకు గ్రామం చుట్టుపక్కల తో పాటు కర్నాటక రాష్ట్రం నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అయితే రథోత్సవం కార్యక్రమంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఎస్ ఐ. మహేష్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు నరవ రమాకాంతరెడ్డి. వీరేష్ గౌడు. సిద్దప్పధని. డీలర్ నర్సింహులు. మండల వైసిపి కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి. ఎంపిపి శ్రీ విద్య. హనుమంతు రెడ్డి. తెలుగు వీరేష్. ఎల్లప్ప. బోడ్డన్న. వైస్ ఎంపిపి ముత్తమ్మ. కడుబూరి బడేమ్మ. మహదేవ్. తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట..!

**మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం..!**

**వైయస్సార్ చేయూత, వైయస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీకి హాజరైన మహిళలు..!**

**మెగా చెక్కులు పంపిణీ..!**

**వైసిపి నేతలు మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి...!**



శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్:పెద్దకడబూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ముందుగా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాతృ మూర్తి లలితమ్మ ఫోటోకు వైసిపి నాయకులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు, వైయస్సార్ చేయూత పథకం చెక్కు పంపిణీ కార్యక్రమం గురువారం ఎంపీడీవో జనార్దన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, జడ్పిటిసి జామ్ రాజేశ్వరి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచులు రామాంజనేయులు, చంద్రశేఖర్, ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు 45 ఏళ్లు పైబడిన మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున ప్రభుత్వం అందజేసింది, నాలుగో విడత మొత్తాన్ని ఇప్పటికే సీఎం జగన్ జమ చేశారు అని మహిళలకు తెలిపారు, జగనన్న ప్రభుత్వంలో వైయస్సార్ చేయూత ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి కోసం కృషి చేస్తారని మహిళలకు పెద్దపీట వేశారని మళ్ళీ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించి ముఖ్యమంత్రి చేసుకుందామని కోరారు, జగనన్న ప్రభుత్వం మహిళలకు మంచి చేసిందని అమ్మ ఒడి వైయస్సార్ చేయూత ఆసరా పథకాలు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు పిల్లలకు విద్య మెరుగైన వైద్య సేవలు ఇలా అనేక పథకాలు ఇంటి గడప వద్దకే వస్తున్నాయని తెలిపారు, జగనన్న హామీ ఇచ్చినట్లు గా మహిళ సంఘాలకు రుణాలు మాఫీ చేసి ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ పడ్డారని పేర్కొన్నారు, జగనన్న దమ్మున్న నాయకుడిని రాష్ట్రంలో ప్రజలకు మాట ఇచ్చి నిలబెట్టుకున్న నాయకుడు జగన్ మాత్రమే అని అన్నారు, చంద్రబాబు పవన్ కళ్యాణ్ లాంటివారు జతకట్టి జగన్ ప్రజా ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారని ప్రజల అప్రమత్తమై ఎంతమంది జతకట్టిన జగన్ మాత్రం ప్రజలతోనే గత కడతారని కాబట్టి జగనన్నని మళ్లీ సీఎం చేసుకునే బాధ్యత ప్రజలుగా మనపై ఉందన్నారు, రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రావాలంటే మంత్రాలయం నియోజకవర్గం ఓటర్లంతా సిద్ధమై ఎమ్మెల్యేకు ఎంపీకి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు, అలాగే పొదుపు మహిళలకు వైయస్సార్ చేయూత ఆసరా పథకాల మెగా చెక్కులను పంపిణీ చేసినందుకు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటోకు , పాలాభిషేకం చేసి మహిళలు సంబరాలు జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో, వైసీపీ నేతలు ముక్కరన్న, అల్లప్ప, గజేంద్ర రెడ్డి, జామ్ ముకాయ్య, అనిల్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు,

## వైఎస్ఆర్సిపి కి భారీ షాక్ వైసీపీ నేత జనసేన పార్టీలో చేరిక.



పెదపూడి శ్రీ ప్రస్థానం ప్రతినిధి: కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం కాంద్రేగుల గ్రామంలో పెదపూడి మండలం జనసేన అధ్యక్షులు నాగిరెడ్డి వీరస్వామి గ్రామ అధ్యక్షులు దుర్గాప్రసాద్ అధ్యక్షతన పెదపూడి మండలం కాంద్రేగుల గ్రామంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నేత పేపకాయల చిన్నబాబు జనసేన పార్టీలోకి చేరారు అనపర్తి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ పేపకాయలు చినబాబుకి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈరోజు కాంద్రేగుల గ్రామంలో అధికార పార్టీ వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరిన పేపకాయల చిన్నబాబును సాదరంగా ఆహ్వానిస్తున్నామని జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి అనపర్తి నియోజకవర్గం లో అనేక గ్రామాల్లో జనసేన పార్టీలోకి వలసలు తిరిగాయని జనసేన పార్టీని ముందుకు నడపడానికి వస్తున్న కార్యకర్తలను చూస్తుంటే చాలా ఆనందకరమన్నారు ,ఈ రాష్ట్రంలో నిజమైన మార్పును జనసేన పార్టీ తెస్తుందని ఏ ఆశయం కోసం అయితే జనసేన పార్టీ నిలబడి ఉందో దానిని ముందుకు తీసుకు వెళ్ళడానికి ముఖ్య భూమిక పోషిస్తుందని అనపర్తి నియోజకవర్గం టిడిపి జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మన సత్తా చాటాలని మర్రెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతరం జనసేన పార్టీ 11వ ఆవిర్భవదినోత్సవం సందర్భంగా జనసేన జెండా ఎగరవేసి కేక్ కటింగ్ చేశారు ,ఈ కార్యక్రమంలో రావాడ నాగు ,అనపర్తి మండల అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి ,బిక్కవోలు అధ్యక్షులు ఇందల వీరబాబు ,వీర మహిళ పాఠంశెట్టి కాశీ రాణి ,మనాల కొండయ్య ,శ్రీరామచంద్రమూర్తి ,,కోసూరు విజయ ,పాఠం శెట్టి వెంకటేష్ ,తివిరిశెట్టి వీర పనింద్ర నియోజకవర్గ నాయకులు కాంద్రేగుల గ్రామ జనసైనికులు పాల్గొన్నారు

## ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో ఫీజులు వసూలు చేయిస్తున్న ఎంఈఓ పై చర్యలు తీసుకోవాలి.

**తల్లిదండ్రులను ముక్కు పిండి వేలకి వేలు వసూలు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి..!**

**ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్.ఈరేష్ ,సిఐటి సి సెంటర్ బొగ్గుల రాజు డిమాండ్..!**

శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్:పెద్ద కడుబూరు మండలం లో గురువారం, ఏఐఎస్ఎఫ్,విద్యార్థుల తల్లిదండ్రుల అద్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అరుణ్ అధ్యక్షత ధర్నా నిర్వహించారు ఆనంతరం జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు కు వినతి పత్రం సమర్పించారు అనంతరం,ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్.ఈరేష్ మండల కార్యదర్శి షెక్షవలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య హక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1)ద్వారా అప్లే చేసుకున్న ప్రతి పేద బడుగగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్యను అందించాలని జీవో జారీ చేస్తుంటే కానీ పెద్ద కడూబూరు మండలం ఎంఈఓ ఆ జీవోలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రెయిన్బో, బాల వికాస్, శ్రీ వేంకట సాయి యుపి,పాఠశాలల యాజమాన్యాలు ద్వారా విద్య హక్కు చట్టాన్ని నీరుగారిస్తూ ఉచిత విద్యను అభ్యాసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఫీజులు కట్టాలని ముక్కు పిండి వేలుకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు ఆవేదన వ్యక్తంచేశారు ఎంఈఓ ఎలాంటి కాపి, గాని జీవో గాని విద్యార్థుల తల్లిదండ్రులకు చూపించకుండా ఫీజులు ఏలా వసూలు చేస్తారని ఎంఈఓ



తీరుపై మండిపడ్డారు విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, ఆంజనయ్య, దుబ్బన్న ,రంగన్న,చిన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలని విద్య హక్కు చట్టం ద్వారా విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తుంటే, పాఠశాల యాజమాన్యం ఫీజులు కట్టాలని ఫోన్ ద్వార ఒత్తిడి చేస్తున్నారు ఎంఈఓ ను వివరణ కోరితే సరైన సమాధానం చెప్పకుండా ఎలాంటి జీవో కాఫీలు చూపించకుండా ఫీజు కట్టాల్సిందేనని ఖరాఖండిగా చెప్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంఈఓ పైన పాఠశాల యాజమాన్యాల పైన విచార చేపట్టి చర్యలు తీసుకోవాలి అలాగే ఫీజులు కట్టించుకున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నుండి తిరిగి విద్యార్థి తల్లిదండ్రులకు ఫీజులు చెల్లించెలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున డివో ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హజరత్ బాషా,రియన్ ఉసేన్ బాషా, సమీర్,రాము ప్రవీణ్, విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, ఆంజనేయ,దుబ్బాన్న,రంగన్న,తదితరులు పాల్గొన్నారు

## తాతకు తగ్గ మనవడిగా ప్రచారంలో దూసుకుపోతున్న నల్లమిల్లి మనోజ్



పెదపూడి శ్రీ ప్రస్థానం ప్రతినిధికాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం అచ్యుత పురోత్రయం గ్రామంలో రెండవ రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు మహాశక్తి కార్యక్రమల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ పార్టీ ప్రచారంలో నల్లమిల్లి మూలారెడ్డి మనవడు తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి ముందుకు దూసుకుపోతున్నారు మనోజ్ గ్రామ ప్రజలను కలుసుకునే విధానం మాట్లాడే విధానం చూసిన కొంతమంది వృద్ధులు అచ్చుగుద్దినట్టు మీ తాతగారిలా కనిపిస్తున్నావు అంటూ గుండెలకు హత్తుకుంటున్నారు మీ తాత మాట్లాడినట్టే మాట్లాడుతున్నావ్ అంటూ తప్పక మీకే ఓటు వేస్తామని బహిరంగంగానే హామీల వర్షం కురిపిస్తున్నారు ప్రజలను ఆకట్టుకోవడంలో తాతను మించిన మనవడిలా ప్రచారంలో దూసుకుపోతున్నదని పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి ఈ కార్యక్రమంలో పెదపూడి మండల టీడీపీ -జనసేన నాయకులు, కార్యకర్తలు,తెలుగు మహిళలు, అచ్యుతపురత్రయం గ్రామ టీడీపీ -జనసేన నాయకులు, కార్యకర్తలు.

## సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ.

**భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు.**





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని రుద్రవరం, ముత్తలూరు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం రుద్రవరంలోని దాసరి పల్లె కాలనీ, బెస్త కాలనీలో దాదాపు రూ 15 లక్షలు, ముత్తలూరు గ్రామం లోని కొత్త బీసీ కాలనీలో రూ 5 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. రుద్రవరం లో జరిగిన పూజా కార్యక్రమంలో ఎంపీపీ బాలస్వామి, వైసీపీ నాయకుడు బైరి బ్రహ్మం, కార్యదర్శులు అరవింద నాయక్, మౌనిక,ముత్తలూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో శ్రీహరి, పాల రామకృష్ణారెడ్డి, బాల చెన్నయ్య ,నంద్యాల నారాయణరెడ్డి ,బండల మాబు, మేస్త్రి హుస్సేన్ పిట్ట లింగమయ్య ,ఇంజనీర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా.. రవి కిరణ్.




శ్రీ ప్రస్థానం - ప్రతినిధి చెన్నయ్య రిపోర్టర్ :అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కదిరికోట రవికిరణ్ ను నియమించినట్టు స్టేట్ ఎస్సీ సెల్ చైర్మన్ సాకేశంకర్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. తనను రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమించినందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాష్ట్ర ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు నాగ మధు యాదవ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కదిరికోట రవి కిరణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సి సోదరుల సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీకి ఎస్సీ సోదరులకు సేవ చేసుకుంటానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తానని అన్నారు.

## నిలబడి ఉన్న మహిళలు వేదిక మీద మాట్లాడిన వైసిపి నేతలకు కనపడకపోవడం దురదృష్టకరం..!

**కుర్చీలు లేక పొదుపు వైయస్సార్ చేయూత, ఆసరా మహిళలు నానాఅవస్థలు..!**

**పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు..!**

శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్:పెద్దకడబూర్ మండలంలోని ఎంపీడీవో ఆఫీస్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చేసిన పొదుపు మహిళలకు వైయస్ చేయూత , ఆసరా, మహిళలకు కుర్చీలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు, గంటలకొద్దీ నిలబడి ఉన్న అప్పటికి పట్టించుకోని సంబంధిత అధికారులు కానీ మహిళ ప్రజా ప్రతినిధులు లైన ఎంపీపీ శ్రీవిద్య గాని జడ్పిటిసి రాజేశ్వరి గాని మహిళలను ఏ మాత్రం పట్టించుకోవడం చాలా దారుణం ఉంటూ విలేకరులకు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు, నిలబడి ఉన్న మహిళలు వేదిక మీద మాట్లాడిన వైసిపి నేతలకు కనబడక పోవడం చాలా దుర దుష్టకరం అంటూ వాపోయారు, ఈ కార్యక్రమంలో మహిళ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు





EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757